## జొన్నవాడలో ప్రదోష కాల వృషభార్చన



బుచ్చి జులై 12 ప్రభాతవార్త పవిత్రపుణ్యక్షేత్రమై న జొన్నవాడలో బహుళ త్రయోదశి సందర్భంగా ఆదివారం దేవస్థాన లో కొలువైవున్న నందీశ్వరుని కి ప్రదోషకాల వృషభార్చన అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందీశ్వరుడికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి,పరమేశ్వరుడుకి ఏకకాలంలో హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున ప్రదోషకాల పూజలు చూసి తరించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు కీలుకుప్ప శ్రీనివాసులు, ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త

## సోమశిల నీటిమట్టం



అనంతసాగరం, జులై 12, ప్రభాత వార్త: మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 33.740 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 2200 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 92.601 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# మండలంలో విద్యా వ్యవస్థలో పలు సమస్యలు

- కోవూరు ఎమ్మెల్యేగారూ ఇటువంటి పాఠశాల సమస్యలపై దృష్టి సారించరూ





**కోవూరు, జూలై12 ప్రభాతవార్త :** గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద కోట్లాది రూపాయలు వ్యయం చేసి కోవూరు మండలంలో పాఠశాల అభివృద్ధి చేసింది. అయితే ఈ పాఠశాలలో ఏర్పాటు చేసిన 12 వాటర్ ప్లాంట్లలో 8 ప్లాంట్లు నేటికీ మరమ్మతుల్లో ఉన్నాయి. దీంతో పాఠశాల విద్యార్థులు మంచినీటి కోసం తీవ్ర అవస్థ పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధానోపాధ్యాయులు డబ్బులు ఖర్చు పెట్టి రిపేరు చేయిస్తున్నా అవి తరచుగా మరమ్మతులకు గురవుతూనే ఉన్నాయి. ఇందుకు కారణం ఏర్పాటు చేసిన ఆ వాటర్ ప్లాంట్లు ఆశించిన మేర నాణ్యతా ప్రమాణాలు లేకపోవడమే.. ముఖ్యంగా చెర్లోపాలెం గ్రామంలో నాడు-నేడు పథకం కింద లక్షలాది రూపాయలు వ్యయం చేసి ఆ భవనాలకు ఒక రూపు తీసుకొచ్చినా అందులో విద్యార్థులు లేక గత2 సంవత్సరం కాలంగా ఆ పాఠశాల మూసివేత దిశలో ఉంది.

**విద్యార్థుల కోసం ఎదురుచూపు** ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో సమూల మైన మార్పులు చేసిన పరిస్థితుల్లో పలు పాఠశాలల్లో విద్యార్థులు లేక వారికోసం ఉపాధ్యాయులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికొన్ని పాఠశాలల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేయడంతో అందులో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నా గదులు లేక చెట్ల కింద పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి వాటిపై ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కొన్ని పాఠశాలల్లో గదులు ఉన్నా.. ఉపాధ్యాయులు ఉన్నా కేవలం ఇద్దరు విద్యార్థులు ఉన్న పరిస్థితి కూడా మండలంలో ఉంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి మండలంలోని విద్యాశాఖలో ఉన్న పలు లోటుపాట్లను సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.




# వైభవంగా రామలింగేశ్వర స్వామి రథోత్సవం

- జనసంద్రమైన రామతీర్థం - భక్తిపారవశ్యంలో భక్తులు





**విడవలూరు, జూలై 12 ప్రభాతవార్త :** విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను వివిధ రకాల పూలతో అద్భుతంగా అలంకరించి, భక్తులకు కనువిందు చేశారు. మంగళ వాయిద్యాల హోరు, భక్తుల శివనామస్మరణతో గ్రామం పులకించిపోయింది.

**భక్తి పారవశ్యంలో భక్తులు :** శంభుని కాపుల సంఘం మరియు తంబి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయం నుండి ప్రారంభమైన రథోత్సవం గ్రామ వీధుల్లో కోలాహలంగా సాగింది. రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. రథం వెళ్తున్నంత సేపూ భక్తులు కాయ, కర్పూరాలతో హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగుతూ భక్తులు పునీతులయ్యారు.

**సేవా కార్యక్రమాలు :** ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, భక్తులు మరియు ప్రజలు ఇబ్బందులు పడకుండా శంభుని కాపుల సంఘం ప్రత్యేక సేవా కార్యక్రమాలను చేపట్టింది. ఉత్సవానికి వచ్చిన వారికి దాహం తీర్చడానికి అవసరమైన తాగునీరు, చల్లని మజ్జిగ ప్యాకెట్లను నిర్వాహకులు అందజేశారు. వారి చొరవను భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.

**ఘనంగా ఏర్పాట్లు :** రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని, రథాన్ని విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. స్థానిక సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరించాయి. భారీగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గట్టి బందోబస్తు నిర్వహించారు.

- ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, శంభుని కాపుల సంఘం ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శిథిల భవనంలో చిన్నారుల విద్యాభ్యాసం

- నిత్యం ప్రాణభయం! - 1971లో నిర్మించిన (ఎన్ఎస్ఆర్జీసీ) పాఠశాల భవనం - 55 ఏళ్లుగా అందని మరమ్మతులు





**కొడవలూరు, జులై 12 ప్రభాతవార్త :** కొడవలూరు మండలంలోని రేగడిచెలిక గిరిజన కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంది. 1971లో నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (ఎన్ఎస్ఆర్జీసీ) గిరిజన కాలనీ పేరుతో నిర్మించిన ఈ పాఠశాల భవనం, నిర్మించి ఇప్పటికి 55 ఏళ్లు కావస్తోంది. కాలక్రమేణా భవనం జీర్ణమై, స్లాబు పెచ్చులు ఊడిపడుతున్నా, అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో 28 మంది గిరిజన చిన్నారులు నిత్యం భయంతో, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విద్యను అభ్యసించాల్సిన దుస్థితి నెలకొంది.

**అధికారుల నిర్లక్ష్యం..తల్లిదండ్రుల ఆవేదన :** పాఠశాల భవనం ప్రమాదకరంగా మారిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు, మండల విద్యాశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యమని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలోని వంటగది తలుపులు విరిగిపోయి, అపరిశుభ్రంగా మారి కుక్కలకు నిలయంగా మారినా, అధికారుల్లో ఎటువంటి చలనం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపే ఆర్థిక స్తోమత లేక, గత్యంతరం లేక గిరిజన కుటుంబాలు తమ పిల్లలను ప్రాణాలకు తెగించి ఈ శిథిల పాఠశాలకే పంపుతున్నారు.

**రేగడిచెలికలో వింత పరిస్థితి.. వివక్షపై విమర్శలు :** మరోవైపు రేగడిచెలిక మెయిన్ స్కూల్లో అన్ని వసతులు ఉన్నప్పటికీ, అక్కడ ఒక ఉపాధ్యాయుడు కేవలం ముగ్గురు విద్యార్థులతోనే విద్యాభ్యాసం సాగిస్తుండటం గమనార్హం. కానీ, అత్యధికంగా 28 మంది గిరిజన విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలను మాత్రం అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రభుత్వ పాఠశాల కావడంతోనే మండల స్థాయి అధికారులు కనీసం అటువైపు చూడటం లేదని, గిరిజన పాఠశాలల పట్ల అధికారులు వివక్ష చూపుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.




**జిల్లా అధికారుల స్పందన ఆవశ్యకం :** ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, తక్షణమే స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గిరిజన బిడ్డలకు సురక్షితమైన భవనాన్ని కేటాయించి, పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని, వారి విద్యాభ్యాసానికి ఉన్న అడ్డంకులను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఉద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకు చేయి పోవడం దారుణం - మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి






**వెంకటాచలం జులై 12 ప్రభాతవార్త** ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయకపోవడం దారుణమని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని చమురుకుంట గ్రామంలో ఆదివారం పర్యటించారు. అనంతరం కాకాని మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 25 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. పిఆర్సి కమిషన్ ప్రయోజనాలను ఆలస్యం చేసే ఉద్యోగాలకు తీరని అన్యాయం చేశారు అన్నారు. అయ్యార్ ప్రకటిస్తామని ఉద్యోగస్తులను మోసం చేసి ఎంప్లాయ్ పెన్షన్లు 35 వేల కోట్ల నుంచి నుంచి 45000, కోట్ల పెన్షన్ పెండింగ్లో ఉన్నాయన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు రెగ్యులరేషన్ చేస్తామని అసత్య ఆరోపణలు చేయటం ఏమిటన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు చెప్పిన ఏ ఒక్క హామీను కూడా అమలు చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి జాడే లేదన్నారు. చెవుడు గుంటలో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరును ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మండల వైసీపీ ఉపాధ్యక్షులు ఎం వెంకట శేషయ్య మాజీ సర్పంచ్ మదను వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ

- సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి
- 14వ తేదీ తుది గడువు
- మిగిలిన వారంతా ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి
- నెల్లూరు ఆర్డీవో ఎన్ ఎస్ అనూష



**నెల్లూరు, జూలై 12, ప్రభాతవార్త – అగ్రికల్చర్** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని నెల్లూరు ఆర్డీవో ఎన్ఎస్ అనూష పేర్కొన్నారు. ఆదివారం ఆమె ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడారు. తమ డివిజన్ పరిధిలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నామని తెలిపారు. రెండు చోట్ల ఓట్లు కలిగి ఉండడం చట్టరీత్యా నేరం అన్న విషయాన్ని ఓటర్లు గ్రహించాలన్నారు. అన్ని సచివాలయాలలో ఎస్ఐఆర్ ప్రక్రియను పగడ్బందీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏఈఆర్వోలు, సూపర్వైజర్లు నిత్యం పర్యవేక్షిస్తున్నారు అని వెల్లడించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు పొందేందుకు, చనిపోయిన ఓటర్లను తొలగించేందుకు, రెండు చోట్ల ఓటర్లుగా ఉన్నవారు ఒకచోట డిలీషన్ చేయించుకునేందుకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 14న తుది గడువును దృష్టిలో పెట్టుకుని మిగిలిన ఓటర్లు బిఎల్ఓ లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయాలని సూచించారు. తన సెల్ నెంబర్ కూడా ఆన్లైన్లో పొందుపరిచామని ఎలాంటి సందేహాలు ఉన్నా తనతో ఫోన్‌లో మాట్లాడవచ్చని తెలిపారు. ప్రాంతం మారుతున్న ఓటర్లకు కూడా ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా వారి అంగీకారంతో అవసరమైన చోట ఓటు నమోదుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఒకవేళ ఎవరికైనా ఎన్యూమరేషన్ ఫారాలు అందకపోతే, ఎవరి ఓటు అయినా గల్లంతయినట్టు గుర్తిస్తే అలాంటి వారు ఈ నెల 15వ తేదీ సచివాలయాలలో ఫామ్ 6 ద్వారా ఓటరుగా నమోదుకు అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేని సమగ్ర ఓటర్ జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 15న బూత్ స్థాయిలో గ్రామసభల ద్వారా నమోదైన ఓటర్ల వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. ఓటర్ల సహకారంతో, అధికారులు సమగ్ర ఓటర్ జాబితాను తయారు చేసేందుకు కార్యాచరణను రూపొందించామని తెలిపారు.

# టాస్క్ పోర్స్ సమావేశం ఏర్పాట్లను పరిశీలించిన కాకాణి“

**నెల్లూరు, జూలై 12, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని డి ఆర్ ఉత్తమ్ హోటల్ 13.07.2026, ఉదయం 10 గంటలకు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు “డా“ కాకాణి గోవర్ధన్ రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించిన టాస్క్ ఫోర్స్ సమావేశంలో ముఖ్య అతిధులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్ ఫోర్స్ ప్రోగ్రాం కన్వీనర్ సాకే శైలజానాథ్ రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు,టాస్క్ ఫోర్స్ సభ్యులు పాల్గొంటారని తెలిపిన కాకాణి



# వెలుగు చూసిన బుచ్చి వ్యవసాయాధికారి హత్య కేసు

- ఇద్దరు నిందితుల అరెస్ట్, పరారీలో కీలక సూత్రధారి

**నెల్లూరు క్రైమ్, జూలై 12, ప్రభాతవార్త** సంచలనం సృష్టించిన బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయ అధికారి నడవాటి శ్రీహరి మృతి కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఇది కేవలం అనుమానాస్పద మృతి కాదని, పక్కా పథకం ప్రకారం జరిగిన హత్య అని నిర్ధారించిన పోలీసులు, ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 6న తన భర్త శ్రీహరి మృతిపై భార్య లావణ్య అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సమగ్ర విచారణకు ఆదేశించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. విచారణలో భాగంగా గోలగమూడికి చెందిన సోంపల్లి రవీంద్ర, రామతీర్థానికి చెందిన బుచ్చింగారి యానాదయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు. వారిద్దరిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.

**ప్రధాన నిందితుడు బావమరిదే..!** ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కుడుముల హరికృష్ణ మృతుడికి స్వయానా బావమరిది అని పోలీసుల దర్యాప్తులో తేలింది. హరికృష్ణ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. హత్యతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల స్పష్టం చేశారు.




# మూడు రాష్ట్రాల్లో జరిగే సంఘటనలు మానవత్వానికి మాయని మచ్చలు

**కోవూరు, జూలై 12 ప్రభాతవార్త :** మూడు రాష్ట్రాల్లో శనివారం జరిగిన మూడు సంఘటనలు మానవత్వానికి మాయని మచ్చలుగా మిగిలి పోయాయని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో షాబాద్‌లో ఒక ఉన్మాది తనపై ఫోక్సో కేసు పెట్టారనే అక్కసుతో బాలికను బాలిక తల్లితో పాటు నాన్నమ్మను హతమార్చి అనంతరం తన భార్య, పిల్లలతో సహా హతమార్చారన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో మనో ఉన్మాది కని పెంచిన తల్లిని, ఆత్మీయతను పంచిన అమ్మమ్మను మేనమామను చంపి తను కూఆ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. తమిళనాడులోని తూతూకూడి జిల్లాలో ఓ కసాయి



తండ్రి తన ఇద్దరి బిడ్డలకు కరెంట్ షాక్ ఇచ్చి చంపి తానుకూడా చనిపోయాడన్నారు. ఈ మూడు సంఘటనలు కూడా సమాజంలో జరుగుతున్న దారుణాలు సభ్య సమాజంలో మానవతా విలువల పతానికికి నిదర్శనంగా నిలిచాయన్నారు. కొంతమంది డ్రగ్స్‌కు అలవాటు పడి దారుణాలు చేస్తుంటే మరికొంత మంది మానసిక ఒత్తిడిలో ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక వేత్తలతో మానవతా విలువలను పెంపొందించడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాథమిక దశ నుంచి చిన్నారులకు నైతిక విలువలు ఏర్పడడం వలన వారితో కొంతమంది అయినా రేపటి తరానికి మంచి పౌరులుగా తయారవుతారన్నారు. ఇటువంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా ఏ చర్యలు తీసుకోవాలో ప్రభుత్వాలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## వేగవంతంగా సర్ ప్రోగ్రామ్



**దుత్తలూరు జులై 12 ప్రభాతవార్త :** ఎన్నికల కమీషన్ నిబంధనలతో ఆదివారం కూడా పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి తహసిల్దారు నాగరాజు సర్ ప్రోగ్రామ్‌ను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆయా గ్రామాల పరిధిలో పోలింగ్ కేంద్రాలలో బిఎల్‌ఓలు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వాలింటర్లు, అందుబాటులో ఉండేలా చేశామన్నారు. ఓటర్లు తమకు సంబందించిన ఏ సమస్య అయినా నివృత్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసు దాడి

**చిల్లకూరు, జూలై 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిక్కవరం గ్రామం శివారు ప్రాంతాల్లో హరిజన వాడకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్న విషయం తెలుసుకున్న చిల్లకూరు పోలీసు వారు ఆకస్మిక దాడి చేయడంతో మనుబోలు ప్రణయ్, మోర సురేష్, బిక్కి కోటయ్య, బందిలి కస్తూరయ్యలు పట్టుబడ్డారు. 1370 రూపాయల నగదు, ఒక మోటార్ బైక్ స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసి ఎస్ఐ ఏ. రమేష్ బాబు దర్యాప్తు చేస్తున్నారు.

## కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

**నెల్లూరు క్రైమ్, జులై 12, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ మండలం, ఆకుతోట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. అతివేగంగా దూసుకొచ్చిన కారు, ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, నెల్లూరు సిటీ, జెండా వీధికి చెందిన షేక్ నవాజ్ (34) తన ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారుజామున ఆసుపత్రిలో ఉన్న తన బిడ్డను చూసేందుకు బయలుదేరారు. అదే సమయంలో, నవాజ్ సోదరుడు షేక్ పర్వేజ్ తన స్నేహితుడితో కలిసి మరో మోటార్ సైకిల్ పై వెనుక వస్తున్నారు. ఆకుతోటలోని పిఎస్ఆర్ కల్యాణ మండపం, రాక్స్ బ్రూవరీ కిచెన్ ఎదురుగా, నెల్లూరు ముత్తుకూరు రోడ్డుపై నవాజ్ వెళ్తుండగా నెల్లూరు - ముత్తుకూరు వైపు నుండి అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చిన కారు నవాజ్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవాజ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మరణించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు షేక్ పర్వేజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

## నెల్లూరు రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైం, జూలై 12, ప్రభాతవార్త :** నెల్లూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం సాయంత్రం 7 గంటలకు ముందు నెల్లూరు రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం దక్షిణ వైపు చివరన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా సిబ్బంది గమనించి పరిశీలించగా అతడు అప్పటికే మృతి చెందినట్లు తేలింది. అనారోగ్య సమస్యల కారణంగా సహజంగా మరణించి ఉండవచ్చు లేదా ఇతర కారణాలు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి 60 నుండి 65 ఏళ్ళ మధ్య వయసు ఉంటుందని, మృతుడు తెలుపు రంగుపై పచ్చ గీతలు ఉన్న హాఫ్ హ్యాండ్స్ టీషర్ట్, తెలుగు రంగుపై డిజైన్ ఉన్న షార్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. చూసేందుకు యాచకుడిలా ఉన్నాడని, మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ఆనవాళ్లు లభించలేదని తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే విధుల్లో ఉన్న స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు జీఆర్పీ ఎస్సై ఎన్. హరిచందన సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పోలీసులు మృతుడి గుర్తింపు కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఇతని గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే నెల్లూరు జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు.

## విద్యుత్ సరఫరా అంతరాయం

**నెల్లూరు, జూలై 12, ప్రభాతవార్త :** నెల్లూరులోని 33/11కేవీ శెట్టిగుంట రోడ్డు సబ్ స్టేషన్‌లోని 11కేవీ డిఎస్ నగర్, 11కేవీ డిఎస్ నగర్ ఇండస్ట్రియల్ ఫీడర్స్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురా నగర్, ప్రశాంతి నగర్, 3వ మైల్, రాజీవ్ గాంధీ కాలనీ, వెంగల్ రెడ్డి నగర్, సాధవారిపాలెం పరిసర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ ఏఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేసారు.

## కాంట్రాక్టు ఉద్యోగులను రెగులైజ్ చేయండి




**నెల్లూరు, జూలై 12, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో కాంట్రాక్టు ఉద్యోగులుగా కొనసాగుతున్న ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సింగ్ సిబ్బందిని వెంటనే రెగ్యులైజ్ చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జీజీహెచ్ వద్ద నిరసన తెలియజేశారు. ఎంతో కాలంగా ఒప్పంద ఉద్యోగులుగా కొనసాగుతున్నామని తమను వెంటనే రెగ్యులైజ్ చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

## ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ




**వింజమూరు, జూలై 12, ప్రభాతవార్త :** ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో సంఘం ఆధ్వర్యంలో వింజమూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి అమలు చేయాలి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి, 4 పెండింగ్ డిఏ లను వెంటనే ప్రకటించాలని, ఇన్ సర్వీస్ టీచర్లకు విద్యార్హత సడలింపు చేసి టెట్ రద్దు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 14న ర్యాలీ, పికెటింగ్ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు.

## మధుర గాయనికి కోటతో అనుబంధం

**కోట, జులై 12 ప్రభాతవార్త :** మధుర గాయని ఎస్. జానికి మరణం కోట ప్రాంత సంగీత అభిమానులను తీవ్రంగా కలచి వేసింది. జానికి కోటలో జరిగిన పలు సంగీత కార్యక్రమాలకు హాజరయ్యారు. ఘంటశాల కళాసమతి వారు కోటలో అనేక సంవత్సరాలగా వార్షికోత్స వేడుకలను నిర్వహించారు. ఆవేడుకలకు ఆమె క్రమం తప్పకుండా హాజరు అయ్యేవారు. ఆమెను ఘంటశాల కళాసమితి అధ్యక్షులు నరసింహాలు, ఎంవిరావుల సగౌరవంగా సన్మానించేవారు. ఈ వేడుకల్లో ఆమె సినీ గీతాలను విని ఆశీస్సులు అందచేసేవారు. పాటలు పోటీల్లో విజజేతలకు ఆమె బహామతులు ప్రధానం చేసింది. స్వర కోకిల మృతితో ఆమెతో అనుబంధం ఉన్న వారు విషాదంలో మునిగిపోయారు.

## గాయని జానకి మరణం బాధాకరం

**- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**కోవూరు జూలై12 ప్రభాతవార్త :** ప్రముఖ గాయని, గానకోకిల ఎస్. జానకి చనిపోయారనే వార్త నన్ను ఎంతగానో బాధించిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. జానకమ్మ తన తీపి గొంతుతో ఎన్నో వేల పాటలు పాడి మనల్ని అలరించారని ప్రశాంతి రెడ్డి గారు గుర్తుచేసుకున్నారు. ఆమె పాడిన జోలపాటలు, భక్తి పాటలు, ప్రేమ పాటలు ప్రతీ ఒక్కరి మనసును తాకాయని చెప్పారు. ముఖ్యంగా తెలుగు ఆడపడుచులకు ఆమె గొంతు ఎంతో ఇష్టమైనదని, తరాలు మారినా ఆమె పాటలు ప్రతీ ఇంట్లో వినిపిస్తూనే ఉంటాయని అన్నారు. జానకి మన మధ్య లేకపోవడం సంగీత లోకానికి పెద్ద లోటని ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. జానకి కుటుంబ సభ్యులకు, అభిమానులకు సానుభూతి తెలియజేశారు.

## సముద్రంలో వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

**బిట్రగుంట జూలై 12 ప్రభాతవార్త :** బోగోలు మండలం పాతకడపాలెంకు చెందిన మత్స్యకారుడు చినపార్వతయ్య(54) ఆదివారం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయ విషాదఛాయలు నెలకొన్నాయి

## మోటార్ సైకిల్ఢ్ డి మహిళ మృతి



**కోవూరు జూలై12 ప్రభాతవార్త :** సోదరి ఇంటికి వెళ్లి కాసేపు మాట్లాడుకునితిరిగి ఆదివారం సాయంత్రం నెల్లూరుకు మోటార్ సైకిల్ లో తనకు వరుసకు కుమారుడైన పటాన్ ఫిరోజ్తో కలసిబీబీ జాన్ అనే మహిళ మోటార్ సైకిల్ లో ప్రయాణిస్తుండగా వెనుక నుంచి మరో మోటార్ సైకిల్ వేగంగా ఢీకొంది ఈ సంఘటనలో మోటార్ బైక్ లో ఉన్న బి బి జాన్ అనే మహిళ తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై ముత్యాలరావు పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సంగీత ప్రపంచం ఒక గొప్ప ధ్రువతారను కోల్పోయింది

**- గానకోకిల ఎస్. జానకి మృతి పట్ల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్ర సంతాపం**



**నెల్లూరు, జూలై 12, ప్రభాతవార్త - వైద్యం :** ప్రముఖ నేపథ్య గాయని, గానకోకిల ఎస్. జానకి కన్నుమూశారనే వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దశాబ్దాల పాటు తన మధురమైన గాత్రంతో దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచాన్ని ఏలిన జానకి, కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. వేలాది అద్భుతమైన పాటలకు ప్రాణం పోసి, ఎందరో వర్ధమాన గాయనీ గాయకులకు ఆమె ఆదర్శంగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. ఆమె మరణం కేవలం తెలుగు సినీ పరిశ్రమకే కాకుండా, యావత్ భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జానకి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మరియు కోట్లాది మంది అభిమానులకు తన సానుభూతిని తెలియజేశారు.

## డిలిమిటేషన్ ఖాయం ప్రత్యేక నియోజకవర్గంగా బుచ్చి



**బుచ్చి జులై 20 ప్రభాతవార్త :** కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వానికి మహిళా బిల్లుకు, డిలిమిటేషన్‌కు సరిపడా బలం చేకూరడంతో ఈనెలలో పార్లమెంట్ వర్షాకాలం సమావేశాలలో మహిళా బిల్లు, డిలిమిటేషన్ బిల్లు తప్పకుండా పాసు అవుతుందని పలువురు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. పాత నెల్లూరు జిల్లా ప్రాతిపదికన తీసుకుంటే ఈ జిల్లాలో 5 నియోజకవర్గాలు పెరుగుతాయని సర్వత్రా చర్చించుకుంటున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీతో కలిసి సంగం, దగదర్తి, అల్లూరు కలుపుకొని బుచ్చిరెడ్డిపాళెం కొత్త నియోజకవర్గంగా రూపుదిద్దుకుంటుందని ఆసక్తికరంగా చర్చించు కుంటున్నారు. ఒక్క నియోజకవర్గానికి లక్షా యాభైవేలు ఓట్లు మాత్రమే అవసరమని, ప్రతి మున్సిపాల్టీ తప్పక నియోజకవర్గం అవుతుందని అందువల్ల ఈసారి బుచ్చిరెడిపాళెం ప్రత్యేక నియోజకవర్గం అవుతుందని, నెల్లూరు టౌన్ 2, నియోజకవర్గాలు, రూరల్-1 ఒక నియెజకవర్గం మొత్తం మూడు నియోజకవర్గాలు అవుతాయని సర్వత్రా చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ పునర్విభజనపై ప్రజలు సర్వత్రా చర్చించుకుంటున్నారు. కోవూరు కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట కోవూరు నియోజకవర్గం కాగా (ఎస్సి, లేదా ఎస్టి) అవుతుందని సర్వత్రా చర్చించుకుంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలపై ప్రజలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.

## గౌడ్లు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించాలి

**ఉదయగిరి నర్సింహులు గౌడ్**



**అనంతసాగరం, జులై12, ప్రభాతవార్త:** గౌడ్లు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని గౌడ సంక్షేమ సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు ఉదయగిరి నర్సింహులు గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మేకవారిపల్లిలో నూతన జిల్లా కమిటీ పర్యటనలో భాగంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో గౌడ కులస్తుల జనాభా చాలా ఎక్కువగా ఉందని, అలాగే రాజకీయంగా చైతన్యవంతమైందని మండల, జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపే నాయకులు ఇక్కడి నుండి ఎదగాలని, యువత అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని, విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తాటి, ఈత, కొబ్బరి వృక్షాల కోసం ఫామ్‌బోర్డు ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని గీత వృత్తిదారుల సాధికారత కోసం పనిచేస్తామని, తాటి ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాల కోసం కృషి చేస్తామని, రాష్ట్రంలో పది లక్షల తాటి చెట్లు నాటడం పర్యావరణాన్ని పరిరక్షించడం చేస్తామన్నారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మైకం వీడి గీతకార్మికుల రక్షణ కోసం నడుం బిగించాలని హితవు పలికారు. తాటిచెట్టు పరిరక్షణ గీత కార్మికుల సంక్షేమం కోసం పాటు పడతామని, కులవృత్తి పునరుద్ధరణ, ఆధునిక శాస్త్ర సాంకేతికతనుఅందించడం గీతన్నల ప్రాణాలు కాపాడడం, గీత కార్మికులకు ప్రమాద బీమా అమలు చేయించడం, బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, గీతన్నలను ప్రభుత్వం ఆదుకునేలా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నం దయాకర్‌గౌడ్, దద్దోలు చక్రపాణి గౌడ్, ఏపూరి రమేష్‌గౌడ్, ముక్కు రాధాకృష్ణగౌడ్, దాసరి రాజేంద్రగౌడ్, జడపల్లి వెంకటరత్నం గౌడ్, తిరకాల మోహన్‌బాబుగౌడ్, దద్దోలు పవన్‌తేజగౌడ్, ఉదయగిరి శ్రీనివాసులుగౌడ్, పంది మస్తానయ్యగౌడ్, గౌడ్ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోగోలు లో చిల్లర దొంగతనాలు

**బిట్రగుంట జులై 12 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన బోగోలు బజారు సెంటర్ నందు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు రెండు హోటల్స్ లోను, రెండు దుకాణాలలోను చోరీయత్నం జరిగిందని దుకాణదారులు తెలిపారు. ఒక దుకాణం లో రెండు సీసీ కెమెరాలు కట్ చేసి తీసుకొని వెళ్లారు. ఇటీవల కాలంలో ఎంతో ప్రశాంతంగా ఉన్న బజారు సెంటర్ లో చిల్లర దొంగతనాలు జరగడంతో వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## ఆత్మహత్య చేసుకున్న వేముల విజయ్

**ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య**



**కోవూరు, జూలై 12 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని ఎన్‌టీఎస్ గేటు వద్ద నివాసం ఉంటున్న వేముల విజయ్ అనే యువకుడు ఆదివారం తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. ఈ మేరకు బంధువులు హుటాహుటిన కోవూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెంది ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై ముత్యాలరావు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహంపై కుటుంబ సభ్యులు పడి రోధిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది.

## పెంచలయ్య అంత్యక్రియలకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం



**చిల్లకూరు, జూలై 12, ప్రభాతవార్త :** మండలంలోని నెలబల్లి, రెట్టపల్లి గ్రామ దళితవాడకు చెందిన మంద పెంచలయ్య (47) అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగించే వాడు అయితే అతనికి 5 సంవత్సరాల క్రితం పక్షవాతం రావడంతో అప్పటి నుండి ఏ పని చేసుకోలేని స్థితిలో మంచంలో ఉన్నాడు. ఆదివారం ఉదయం పెంచలయ్య మరణించాడు. వారిది పేద కుటుంబం కావడంతో గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు వెంటనే స్పందించి అంత్యక్రియల ఖర్చుల కోసం 15 వేల రూపాయలను ట్రస్ట్ సభ్యుడైన బాబు ద్వారా పెంచలయ్య కుటుంబానికి అందజేసారు.

## రవాణా రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందించాలి

**– సిఐటియు ఆటో యూనియన్ జిల్లా నాయకులు బివి. రమణయ్య**



**గూడూరు, జూలై 12, ప్రభాతవార్త :** రవాణా రంగ కార్మికుల పట్ల అధిక శాతం లాభాలు పొందుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మినీ ట్రక్,లారీ,ఆటో కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నాయని, సహాయ సహకారాలు వారి కుటుంబాలకు అందజేయాలని, సిఐటియు ఆటో యూనియన్ జిల్లా నాయకులు బివి. రమణయ్య ఆదివారం గూడూరు లోని సిఐటియు కార్యాలయంలో జరిగిన ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు గూడూరు మినీ ట్రక్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు.దేశంలో జరుగుతున్న పరిణామాలను సాకుగా చూపుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యవసర వస్తువులు, స్పేర్ పార్ట్స్, ఆయిల్, ధరలు విపరీతంగా పెంచి రవాణా రంగాన్ని సంక్షోభంలోకి పోయే విధంగా ఈ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే వెను వెంటనే ధరలను పెంచే ప్రభుత్వాలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర భారీగా తగ్గినా ఈ ప్రభుత్వాలు ఎందుకు తగ్గించడం లేదని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని,అలాగే ఎల్ఎల్ఆర్ మంజూరుకు కంప్యూటర్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, వాహనాల ఇన్సూరెన్స్,పొల్యూషన్‌లకు ఓటిపి విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకో వడం జరిగింది. అధ్యక్షులుగా ఏ.రాజగోపాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు కె.సుధాకర్‌యాదవ్,ప్రధాన కార్యదర్శి ఎం.ఈశ్వరయ్య యాదవ్,సహాయ కార్యదర్శి సి.హెచ్.శ్రీనివాసులు,కోశాధికారి డి.వేణులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.కమిటి సభ్యులుగా నవకోటి మస్తాన్,సిహెచ్‌నాగేంద్ర,పి.కోటేశ్వరరావు,వి.శ్రీనివా సులు, బి.గురవయ్య,పి.సాయికుమార్,ఏ.విజయచంద్ర, జి.వెంకటేశ్వర్లు కొనసాగనున్నారు.

## అంగన్‌వాడీల్లో జ్ఞానజ్యోతి

**– ఒక నుంచి ఆంగ్ల అక్షరాల బోధన**

**కోట,జులై 12 ప్రభాతవార్త :** చిన్నారికి మూడేళ్లు వస్తే చాలు తల్లిదండ్రులు నర్సరీ చదవుకు పంపిస్తున్నారు. ఆంగ్లంలో మమ్మీ,డాడీ, ..ఏబీసీడిలు చదివితే చాలు మురిసిపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా పిల్లలకు ఆంగ్ల అక్షరాలు నేర్పించే క్రతువు మొదలైవనుంది. ప్రీస్కూల్ బాలలకు ఆంగ్ల అక్షరాలు,పదాలు నేర్పేలా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. వారు పిల్లలకు డిజిటల్ పాఠాలు చెప్పనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలు ఆంగ్ల పదాలు స్పష్టంగా పలికేలా నేర్పంచనున్నారు. తెలుగుతోపాటు ఆంగ్లంపై చిన్నారులు పట్టు సాధించేలా పాఠాలు బోదించనున్నారు.ఆమేరకు కోట సీడిపివో, మునికుమారి, సూపర్ కవితలు ఇటివల తిరుపతి,నాయుడుపేటల్లో శిక్షణ ఇచ్చారు.పోటీ ప్రపంచానికి తగ్గట్లుగా డిజిటల్ తెరలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బోధన చేయనున్నారు. డిజటల్ సామాగ్రిని ప్రభుత్వం సమకూర్చనుంది. బాలల సంపూర్ణ వికాసానికి దోహదం చేసేలా కరికులమ్ రూపొందించారు. కృత్యాలతో అభ్యసన తరగతులు నిర్వహించనున్నారు. చిన్నారుల్లో వైవిధ్యాన్ని గుర్తించి ప్రోత్సహించనున్నారు.జ్ఞాన జ్యోతి అమల్లో తల్లదండ్రులు భాగస్వామ్యాన్ని కీలకం చేశారు.

## నెల్లూరులో బ్రిడ్జిపై నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైం, జూలై 12, ప్రభాతవార్త :** నెల్లూరు పట్టణంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నేషనల్ హైవేపై ఉన్న పెన్నా వంతెన, ప్రశాంతి నగర్ వైపు మూడవ పిల్లర్ వద్ద ఆదివారం తెల్లవారు జామున 30 35 ఏళ్ళ వయస్సు గల గుర్తు తెలియని పురుషుడు ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు, అతను మానసిక స్థితి సరిగా లేని వ్యక్తిగా అనుమానిస్తున్నారు. చాలా రోజులుగా స్నానం చేయలేదు, చేతి గోర్లు పెరిగి ఉన్నట్లు గుర్తించారు. మృతుడు నలుపు నిక్కరు, ఎడమ చేయి విరిగి ఉండి, కుడి చేతిపై శివుని బొమ్మ, చక్రం, దిన్ అనే పచ్చబొట్లు, ఎడమ చేతిపై 3 నక్షత్రాల పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వివరాలకు సరిపడే వ్యక్తి ఎవరైనా కనిపించకుండా పోయి ఉంటే నవాబుపేట పోలీస్ స్టేషన్ ఎస్సై 9440796310, సీఐ 9440796306 నెంబర్లలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## రావులకొల్లులో ఉచిత ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించిన "కంచి"



**ఆత్మకూరు,జులై12,ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని రావులకొల్లు గ్రామంలో ఆదివారం శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచిపరమేశ్వరరెడ్డి , ఆయన సతీమణి జయమ్మల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభించారు.ఈసందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈగ్రామం తన సతీమణి జయమ్మ స్వగ్రామమని, ఈగ్రామంలో ప్లాంట్ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈప్లాంట్ ద్వారా గ్రామస్తులకు ఉచితంగా మంచినీటిని అందిస్తున్నామన్నారు. ప్లాంట్ నిర్వహణా ఖర్చులు తానే భరిస్తానన్నారు. ప్లాంట్ ప్రారంభంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరంగ్రామంలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు కంచి పరమే శ్వరరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేడు గంధ మహోత్సవం విస్తృత ఏర్పాట్లు



**ఉదయగిరి, జులై 12, ప్రభాతవార్త :** ఉదయగిరిలోని శ్రీశ్రీశ్రీ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సావలి 221వ గంధ మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. గంధ మహోత్సవానికి దర్గా కమిటీ విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ గంధ మహోత్సవానికి పరిసర ప్రాంతాల భక్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ప్రతి ఏడాది రావడం ఆనవాయితీగా వస్తుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తారు. విద్యుత్ దీపాల అలంకరణలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కులమతాలకు అతీతంగా ఈ గంధ మహోత్సవంలో ఈ ప్రాంత ప్రజలందరూ పాల్గొనడం విశేషం. మత సామరస్యానికి ప్రతీకగా ఇగంధ మహోత్సవం అని ఈ ప్రాంత ప్రజలు పేర్కొంటారు. ఆదివారం రాత్రి హక్కుదారులచే సందల్ మాలీ, 13వ తేదీ సోమవారం రాత్రి 8 గంటలకు అన్న ప్రసాద సహపంక్తి భోజనాలు రాత్రి 10 గంటలకు సినీ ఆర్కెస్ట్రా, తెల్లవారుజామున 2.30 నిమిషాలకు నూరుల్లాసా వారి నివాసం నుండి గంధం బయలుదేరి 5గంటలకు దర్గా షరీఫ్ చేరుతుంది. చదివింపుల అనంతరం ప్రసాదం భక్తులకు అందజేయడం జరుగుతుంది. 14వ తేదీ మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు దీపారాధన కార్యక్రమం, రాత్రి 10 గంటలకు గొప్ప ఖవాలి పోటీ నిర్వహించబడుతుంది. 15వ తేదీ ఉదయం 7గంటలకు తహలీల్ ఫతేహ జరుగుతుందని భక్తులు విచ్చేసి గంధ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు మన్సూర్ రోజ్దార్ తెలిపారు.

## వినియోగదారుల హక్కుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాసులు



**ఉదయగిరి, జులై 12, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్(వినియోగదారుల హక్కుల సంఘం) మండల అధ్యక్షునిగా సంజురాజుపల్లి గ్రామానికి చెందిన ఓంకారం శ్రీనివాసులు నియమితులయ్యారు. నియామక పత్రం అందుకున్న శ్రీనివాసులు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు పరిరక్షణకు కట్టుబడి ఉంటారని, ఎవరైనా వ్యాపారస్తులు వినియోగదారులను మోసం చేస్తే తనను సంప్రదించాలని కోరారు. వినియోగదారుల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తానని నిర్ణీత ధరల కంటే అధిక ధరలు వసూళ్లు చేసిన, నాసిరకం వస్తువులు విక్రయించిన చట్టపర చర్యలు తీసుకున్నందుకు వెనుకాడమని వినియోగదారుల చట్టాలను ప్రజలకు తెలియజేసేందుకు త్వరలోనే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఎవరైనా న్యాయ సహాయం కావల్సి వస్తే 9550716302 అనే నంబర్‌ను సంప్రదించాలని 24 గంటలు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు.

## సర్వర్ సమస్యతో వినియోగదారులకు ఇక్కట్లు




**బిట్రగుంట జులై 12 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాలలో ఈపాస్ మిషన్ ల సర్వర్ పనిచేయ కపోవడం తో ఆదివారం సాయంత్రం వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురి అయ్యారు. మరో మూడు రోజుల్లో రేషన్ పంపిణి ముగుస్తు ండట ంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆది వారం అందరు ఇండ్ల వద్ద ఉండి సరుకులు తెచ్చుకొనేందుకు దుకాణాల దగ్గరకు వెళ్లడంతో వారు వెనుతిరిగిరావాల్సి వచ్చింది. ఈ వారంలో ఈ పరిస్థితి తలెత్తడం ఇది రెండో సారి ఇకనైనా అధికారులు వినియోగదారులకు ఎదురు అయ్యే ఈ సమస్య ను పరిష్కరించాలని కోరుతున్నారు

## ఓటరు జాబితా సవరణకు ఊపు

**– 88.65 డిజిటైజేషన్ పూర్తి – తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి**



**కొడవలూరు, జూలై 12 ప్రభాతవార్త:** మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ వేగంగా కొనసాగుతోందని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి తెలిపారు. మండలంలోని మొత్తం 41,244 మంది ఓటర్లకు సంబంధించి 36,563 ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటైజ్ చేయడంతో 88.65 శాతం పురోగతి నమోదైందన్నారు. ఆదివారం ఒక్కరోజే 406 ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటైజ్ చేసినట్లు తెలిపారు. మొత్తం 55 మంది బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని చెప్పారు.సూపర్‌వైజర్ల వారీగా ఏవీడీ రామప్రసాద్ పరిధిలో 146, పీ. రామ్ హరీష్ పరిధిలో 81, ఆర్. అశ్విన్ పరిధిలో 77, కె.మస్తాన్‌బాబు పరిధిలో 53, ఎం.రామగాయత్రి పరిధిలో 49 ఫారాల డిజిటైజేషన్ ఆదివారం పూర్తయిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేసేందుకు అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు కొనసాగిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

## గండిపాలెంలో చోరీ.. నగదు, బంగారం అపహరణ



**ఉదయగిరి, జులై 12, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో దుండగులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఒంటరిగా నివసిస్తున్న కోమటి ఆదిలక్ష్మి ఈనెల మూడవ తేదీ హైదరాబాద్‌కు వెళ్లారు. ఆమె వెళ్లిన సమయంలో ఘటన జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ఉదయగిరి ఎస్సై బి.మహేంద్ర నిందితులను త్వరలోనే పట్టుకుని చోరీ సొత్తు రికవరీ చేస్తామని తెలపారు. వివిధ పనులపై బయట ప్రదేశాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇంట్లో నగదు బంగారం ఎట్టి పరిస్థితుల్లో ఉంచుకోకూడదని పోలీసులకు సమాచారం అందిస్తే తగు భద్రత చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఆయన అన్నారు. మండలంలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఆధారం కోల్పోయిన పిల్లలకు నిత్యవసర వస్తువులు పంపిణీ



**కావలి, జులై 12 ప్రభాతవార్త :** కావలి తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఉన్న పిల్లలకు నిత్యవసర వస్తువులు బియ్యం, పిల్లల పేర్లపై నెల నెలా పోస్టాఫీసులో నగదు జమ చేస్తున్న పాస్‌పుస్తకాలను ఆదివారం అందజేశారు. సంస్థ అధినేత లిఖిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏరియా ఆసుపత్రి వైద్యులు ఆర్‌వి.హరిత, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు,జి.కళ్యాణి ఉపాధ్యాయులు సరస్వతి, దివ్యలు పాల్గొని మాట్లాడారు. సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని సాయం చేస్తున్న దాతలకు, అండగా నిలబడిన సంస్థకు మంచిపేరు తీసుకుని వచ్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. లిఖిత మాట్లాడుతూ తమ సంస్థచే ఎటువంటి ఆధారం లేని విద్యార్థులను దాతల సహకారంతో దత్తత తీసుకొని వారి సంరక్షకుల వద్దనే ఉండి వారి జీవనానికి అవసరమైన నిత్యవసర వస్తువులు, బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. వారి చదువుల కోసం పిల్లల అకౌంట్లలో నగదు జమ చేస్తూ ఉన్నామని తెలిపారు. ఈ సందర్బంగ పేద విద్యార్థులకు సహాయసహకారాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అథిదులకు సంస్థచే సత్కారం చేయడం జరిగింది.

## పట్నంలో ఉంటాం.. ఊళ్లో ఓటేస్తాం

**కోట, జూలై 12 ప్రభాతవార్త :** రెండుచోట్లా ఓటు హక్కు.. వలస కార్మికులు, మృతులు.. డూప్లికేట్.. ఇలా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. కోట మండలంలో 42,500 మందికి ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను అధికారులు అందజేశారు. వాటన్నింటినీ తిరిగి డిజిటలైజేషన్ చేయాల్సి ఉంది. పట్టణాల్లో చాలామంది ఓటర్లు ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి ఇవ్వడం లేదు. వీరు గ్రామాల నుంచి వచ్చి స్థిరపడిన వారు. తమ సొంతూళ్లోనే ఎన్యూమరేషన్ పత్రాలిచ్చారు. కోట మండలంలోని ఉచ్చువారిపాలెం, జరుగుమల్లి, విద్యానగర్, గూడలి, ఉత్తమనెల్లూరు గ్రామాలకు చెందిన పలువురు వ్యాపారులు, ఉద్యోగులు చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. కానీ ఓటు మాత్రం స్వగ్రామాల్లోనే నమోదు చేసుకుంటున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఆదివారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక శిబిరాన్ని అధికారులు నిర్వహించారు. పలువురు ఓటర్లు వచ్చి అధికారులకు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేశారు. ఎన్యూమరేషన్ పత్రాలను ఒకేసారి ఇవ్వడం వలన డిజిటలైజేషన్ చేయాల్సి రావడంతో బిఎల్ఓలపై భారం పడింది.

## గాయని జానకి మృతి పట్ల సంతాపం



**కావలి, జులై 12 ప్రభాతవార్త :** ప్రముఖ గాయని ఎస్.జానకి మృతి పట్ల చింతిస్తూ శ్రీ సీతారామసమితి కావలి అధ్యక్షులు శ్రీదర్ ఉపాధ్య ఓఉలు ఏ.వల్లినాథ్ ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దక్షిణ కోకిల, గాన కోకిల బిరుదలతో విశేష గుర్తింపు పొందిన మైసూర్‌లోని వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారన్నారు. ఆమె 1938 ఏప్రిల్ 23న గుంటూరుజిల్లా బాపట్ల మండలం, పల్లపట్లగ్రామంలో జన్మించారు. ఈమె మృతి దక్షణ భారత సంగీత ప్రపంచానికి తీరనిలోటు అని తెలిపారు. ఆమెకు ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆమె మృతికి సంతాపం తెలియజేయ డం జరిగిందన్నారు.

## గుళికల మాత్రలు తిని వ్యక్తి మృతి



**కావలి, జులై 12 ప్రభాతవార్త :** కావలి మండలం చెన్నయ్యపాలెం ఎస్‌సకాలనీకి చెందిన పొట్లూరి సింహాద్రి(67) గుళికల మాత్రలు తిని మృతి చెందడం జరిగింది. రూరల్ పోలీసుల సమాచారం మేరకు వివరాలి లావున్నాయి. మృతుడు సింహాద్రికి సుమారు 10ఏళ్ళగా అనారోగ్య సమస్యతో బాదపడుతూ ఉండేవా డని ఇటీవల ఆనారోగ్యసమస్య ఎక్కువైంది .దీనికి తోడు భార్య కూలిపనులు చేసుకొంటూ జీవనం పొందేవారు. ఇది భరించలేని సింహాద్రి మనస్తాపంకు గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో శనివారం గుళికలు మాత్రలు తిని ఆపస్మారక స్థితికి చేరుకొని మృతి చెందినట్లు భార్య ఆదిలక్ష్మమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జానకి మరణం సంగీత ప్రపంచానికి తీరనిలోటు



**కావలి, జులై 12 ప్రభాతవార్త :** పగలే వెన్నెల కురిపించి, వెలుగుతూ ఉంటాను నీ దివ్వెగా అని మాటిచ్చి తరలిపోయిన సుమదుర గాయని జానికి మరణం సంగీత ప్రపంచానికి తీరలి లటు అని కావలి ఉమెన్ పోర్స్ సభ్యులు జి.శారద, లావణ్య, కవిత, పార్వతి శంకర్, పాతిమ, సుహాసినిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జానకి మృతికి వారు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో వేలాది పాటలు పిలల్ల నుంచి వృద్దుల వరకు అలరింపచేశారన్నారు. ఆమె పాడిన పాటలు మధురంగా వినసొంపుగా ఉంటాయని కొనియాడారు. సంగీత ప్రపంచంలో ఆరని దీపమని తెలిపారు. యాబైవేల పాటలుపాడిన ఆమె బౌతికంగా దూరమైనా మనకు పాట లరూపంలో ఉంటారన్నారు. బాలసుబ్రమణ్యం లాంటి వారిని సీని పరిశ్రమకు పరిచయం చేసిన ఆమె శ్రోతలకు వీనుల విందును అందింప చేశారన్నారు. ఆమె పాడుతా తీయగా కార్యక్రమం ద్వారా ఎందరో బావిగాయకులను అందించిన ఘనత వారందరికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

## ప్రతిభ కలిగిన విద్యార్దులకు నగదు పురస్కారం




**కోట,జులై 12 ప్రభాతవార్త** కోటలోని కోటమ్మ ఆలయం వద్ద ఆదివారం షిరిడి సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో దాతల సహకాంతో 40మంది విద్యార్దులకు పదోవతరగతిలో చక్కని ప్రతిభ కనపరిచిన విద్యార్దులకు నగదు పురస్కారాలను అంద చేశారు. ఒక్కొక్క విద్యార్దికి రూ 5వేల వంతును అందచేశారు. అదే విధంగా ఇంజినీరింగ్‌లో పేద విద్యార్దులకు ఒక్కొకరికి రూ 10వేలు వంతున 30 మంది విద్యార్దులకు సహాయం అందచేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిలుగా నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి,జి.కె. సూపర్ స్పెషల్‌టీ ఆసుపత్రి అధినేతటి.గోపాల్ కృష్ణయ్య,హజరైయ్యారు. ఛైర్మెన్ అల్లం రమణయ్య మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి కోట ప్రాంతంలో విద్యా రంగంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్దులకు దాతల సహకారంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. తమ సంస్దకు సహకరిస్తున్న దాతలకు ఆయన పేరు పేరున ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమలంలో ఎంఇఒ మస్తానయ్య,వాకాడు ఎంఇఒ నశీంఅలీ, కోట.ఎవికెఆర్ జిడ్పి హెచ్.ఎం.కరుణాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు,పెళ్లూరు కోటీశ్వరరెడ్డి,గిరిదర్‌రెడ్డి, రావూరి వెంకటేశ్వర్లు, వెంకటరమణారెడ్డి,శివరామయ్య శెట్టి,ఆవుల సుబ్బయ్య,బాబురావు,పాల్గొన్నారు.

## నేడే జలీల్ అహ్మద్ చేతుల మీదుగా సైకిళ్ల పంపిణీ



**కోట, జులై 12 ప్రభాతవార్త** కోట మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని బాలికలకు సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం కరుణా కర్‌రెడ్డి తెలిపారు. 8, 9 తరగతులు చదువుతున్న బాలికలకు ఈ సైకిళ్లను జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ చేతుల మీదుగా పంపిణీ జరుగుతుందని హెచ్ఎం తెలిపారు. ఏప్రిల్ నెలలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృ త్వంతో సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ రోజు ఎమ్మెల్యే సునీల్‌కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర 53 సైకిళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సోమవారం 594 సైకిళ్లను జలీల్ అహ్మద్ పంపిణీ చేస్తారని చెప్పారు.

## 84 శాతానికి చేరిన ఎస్ఐఆర్ డిజిటైజేషన్ : తహాశీల్దార్ ఏ. లక్ష్మీప్రసన్న



**కొడవలూరు, జూలై 12 ప్రభాతవార్త**:మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో డిజిటైజేషన్ వేగంగా కొన సాగుతోందని తహశీల్దార్ ఏ. లక్షీ ౖప్రసన్న తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 41,622 ఎన్యుమరేషన్ ఫారాలు (ఈఎఫ్‌లు) పంపిణీ చేయగా, వాటిలో 34,913 ఈఎఫ్‌లను డిజిటైజ్ చేసి 83.88 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించారు.గ్రామాల వారీ గా పరిశీలిస్తే పార్లపల్లి 95.55 శాతంతో తొలి స్థానంలో నిలవగా, రామతీర్థం 90.18 శాతం, అలగానిపాడు 87.92 శాతం, వరిణి 86.60 శాతం, అన్నారెడ్డిపాలెం 85.17 శాతం, రామచంద్రా పురం 84.98 శాతం, దంపూరు 82.67 శాతం, వావిళ్ల 82.37 శాతం, ఊటుకూరు 81.72 శాతం, విడవలూరు 81.50 శాతం, చౌకచెర్ల 81.06 శాతం, ఊటుకూరు పెద్దపాళెం 80.70 శాతం, ముదివర్తి 76.93 శాతంతో డిజిటైజేషన్ కొనసాగుతోంది.మిగిలిన ఈఎఫ్‌ల డిజిటైజేషన్‌ను మరింత వేగ వంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు బీఎల్‌వోలు, సూపర్ వైజర్లతో సమన్వయం చేసి చర్యలు చేపట్టినట్లు తెలిపారు



## కోటలో సర్ 92 శాతం వేగం పెంచిన అధికారులు



**కోట,జులై 12 ప్రభాతవార్త** సర్ డిజిటైజేషన్ ప్రక్రియ మరో 48 గంటల్లో ముగియనుంది. కోట మండలంలో ఆదివారం సాయంత్రం 6గంటలకు 92 శాతం పూర్తియింది. మరో 8 శాతం కూడా పూర్తి చేసే ధిశలో అధికారం యంత్రాగం వేగం మరింత పెంచింది. ఇప్పటికే తహిసీల్దార్ కె.జయజయరావు ఈ సర్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రోజు కోట మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేప డుతూనే క్షేత్ర స్దాయిలో పర్యటిస్తున్నా రు.ప్రధానంగా కోట, విద్యానగర్, గూడలిలో ఎక్కువగా ఓటర్ల ఇతర ప్రాంతాల్లో ఉండటంతో ఆయా ప్రాంతాల్లో కొంత మేర బిఎల్‌వ్వోలు మరింత కష్ట పడాల్సి వచ్చింది. అయినా తహిశీల్దార్ ఆయా బిఎల్‌వ్వోలకు ఎప్పుటికప్పడు వారికి సూచనలు ఇస్తూ సర్ కార్యక్రమాన్ని వేగం పెంచారని చెప్ప వచ్చును.

## నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం



**నెల్లూరు, జూలై 12, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు విద్యుత్ భవన లో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు 0861-2320427 నెంబర్‌లో నిర్వహించబడుతుందని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘ వేంద్రం తెలిపారు. అలాగే, ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ప్రతి సోమ వారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ సిఎండీ కార్యక్రమాన్ని ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.30 వరకు 8977716661 నెంబర్‌లో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ రాఘవేంద్రం కోరారు.



## ముఖ్యమంత్రితో కలిసి డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి నారాయణ

**నెల్లూరు, జూలై 12, ప్రభాతవార్త - వైద్యం** ముంబయి ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయిం చుకుని కోలుకుంటున్న ఆంధ్ర పదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయు

## 91 శాతం డిజిటలైజేషన్ పూర్తి



**కోవూరు, జూలై 12 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ఎస్ఐఆర్‌కు సంబంధించి 91 శాతం డిజిటలై జేషన్ పూర్తి కావడం జరిగిందని, మిగిలినది కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి పెటా లని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్‌వోలకు సూచనలిస్తూ మృతులకు సం బంధించి పర్మినెంట్ మైగ్రేషన్‌కు సంబంధించి వివరాలు నమోదు చేసే సమయంలో సంబంధిత బీఎల్‌వోల దగ్గర సంతకం తీసుకోవాలని, అదేవిధంగా బంధువుల వద్ద కూడా మృతులకు సంబంధించిన వివరాలు నమోదు చేసే విషయంలో సంతకం తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ బషీర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

## ఫ్యాప్టో పోస్టర్ విష్కరణ




**కోవూరు, జూలై 12 ప్రభాతవార్త** : కోవూరులోని మండల విద్యాశాఖ అధికారి ప్రాంగణంలో ఆదివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవి ష్కరణ కార్యక్రమాన్ని సంఘం ప్రతి నిధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా కో కన్వీనర్ మురళికృ ష్ణ మాట్లాడుతూ 14వ తేదీ జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో న్యాయమైన ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ నెల్లూరులో జరిగే నిరసన కార్యక్రమానికి మద్దతుగా ఈ పోస్టర్లను ఆవిష్కరించడం జరిగిందన్నారు. జిల్లా నాయకులు కె. నాగిరెడ్డి, జుల్ఫికర్ ఆలీలు మాట్లాడుతూ పెండింగ్ డీఏలు ప్రకటించి, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. టెట్ విధానాన్ని రద్దు చేయాలని డి మాండ్ చేశారు. ఫ్యాప్టో నేత డేవిడ్ చిన్నబాబు, వివిధ ఉపాధ్యా సంఘాలనేతలు బి.శ్రీనివాసులు, ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖాజావలి,భాస్కర్‌రావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, టి. వెంకట రామ య్య, బి. శ్రీనివాసు లు, బి. వెంకయ్య, తదితరులు ఉన్నారు.

## ఎక్సైజ్ శాఖకు సంబంధించి 83 కేసులు పరిష్కారం



**కోవూరు, జూలై 12 ప్రభాతవార్త :** కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో కోవూరు ఎక్సైజ్ సర్కిల్‌కు సంబంధించి 83 కేసు లు పరిష్కారం కావడం జరిగిందని ఎక్సైజ్ సీఐ కిషోర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 42 కేసులు అక్రమ మద్యానికి సంబంధించి, మరో 41 కేసులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని, ఈ 83 కేసులకు సంబంధించి 1,65,416 రూపాయ లను అపరాధ రుసుము రూపంలో ప్రభుత్వ ఖజానాలో జమ చేయడం జరి గిందన్నారు.

## నేడు ఆర్అండ్‌బీ బంగ్లా ప్రాంగణంలో వీపీఆర్ నేత్ర సేవలు




**కోవూరు, జూలై 12 ప్రభాతవార్త :** కోవూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ప్రాంగణంలో సోమవారం వీపీ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీపీఆర్ నేత్ర బస్సు కంటి పరీక్షలు నిర్వహించడం జరు గు తుందని పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించే ఈ కంటిపరీక్షల శిబిరానికి పెళ్లకూరు కాలనీ, ఎన్ఎస్ఆర్ కాలనీశాంతినగర్ తదితర ప్రాంతాల ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## శ్రీ శాంభవి అంకాల పరమేశ్వరి ఉత్సవాలు ప్రారంభం



**గుండెమడకల (వింజమూరు), జూలై 12, ప్రభాత వార్త:** వింజమూరు మం డలం గుండెమడకల గ్రామం లో కొలు వై ఉన్న శ్రీ శాంభవి అంకాల పరమే శ్వరి అమ్మవారి వార్షిక తిరుణాల ఉత్స వాలు ఆదివారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఉత్సవంలో భాగంగా ఉదయం 7 గంటలకు ఆలయ శుద్ధి, గణపతిపూజ, పుణ్యా హవచనంతో కార్యక్రమాలు మొదలయ్యాయి. నేటి నుండి 5 రోజుల పాటు జరిగే ఈ ఉత్స వాల్లో పుట్ట బంగారం, సముద్రపు స్నా నం, ఉయ్యాల, జమ్మి చెట్టు పూజ, గ్రామోత్సవం, పొంగళ్లు, బండ్లు తిరు గుట వంటి ప్రత్యేక పూజలు నిర్వహి స్తారు. ఉత్సవం ప్రారంభ రోజునే భక్తు లు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామమంతా జాతర శోభతో కళకళలాడుతోంది. అమ్మ కరుణ అందరి పై ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## ఆదర్శవార్డన్ నాగరాజుకు ఘన సన్మానం



**బుచ్చి జులై 12 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమీషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డిచే అభినందన లు,సన్మానం అందుకున్న ఎస్‌సి హాస్టల్ వార్డన్ సిహెచ్ . నాగరాజు సేవలు అద్భుతమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత డాక్టర్ చీదరాల చెన్నయ్య ప్రశంసించారు. ఆదివారం పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆద్వర్యంలో డాక్టర్ చీదరాల చెన్నయ్యను శాలువాలు కప్పి ,మాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చెన్న య్య మాట్లాడుతు వార్డన్ చదలవాడ నాగరాజు విద్యార్దులకోసం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నా రు.హాస్టల్ కార్పోరేట్ స్కూల్స్ కన్నా బాగుందని అభినందించారు.అనంతరం వార్డన్ నాగరాజు మా ట్లాడుతు, సిబ్బంది, విద్యార్దులు,అధికారులు అందరి సహకారంతో హాస్టల్‌ని తీర్చదిద్దగలిగేనని ఆయన పేర్కున్నారు. హాస్టల్ అభివృద్దికి మరింత కృషి చేస్తానని అన్నారు.ఈ సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫే ర్ అసోసియేషన్ అద్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, ఉపాధ్యాయులు సిహెచ్ ఉమామహేశ్వరరావు, పి.వి .కె ప్రసాద్, జొన్నవాడదేవస్దానం ట్రస్టు బోర్డు మెంబర్ అండగుంట శ్రీనివాసులు వార్డన్‌ని శాలువాలు కప్పిపూలమాలలు వేసి,మెమోంటోనుఅందజేశారు. విద్యార్దులు తల్లిదండ్రులు పాల్గోన్నారు.



## మాదకద్రవ్యాల వినియోగ నిషేద చట్టాన్ని పటిష్టం చేయాలి



**కావలి, జులై 12 ప్రభాతవార్త :** మాదకద్రవ్యాల వినియోగ నిషేద చట్టాన్ని పటిష్టం చేయాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొ న్నా రు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మట్లాడుతూ సమాజంలో మాద కద్రవ్యాల వినియోగం మానవాళికి ప్రమాదకరమని యువత మాదకద్రవ్యాల వినియోగ నిషేద చట్టంపై అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా ఎదగాలని కోరా రు. సమాజంలో యువత గంజాయి, బ్రౌన్‌షుగర్ వంటి మత్తుపదార్థాలను సేవించడం వల్ల యువత నిర్వీర్యం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. వివే కానందుని బోధనల ప్రకారం ఉక్కు నరాలు ఇనుప కండరాలు కలిగిన ఆరోగ్య వంతైమన యువత ఈ సమాజానికి అవసరమని పేర్కొన్నారు. ఈ మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే దుష్‌ఫలితాలపై యువతకు అవగాహన పెంచాలని పౌర సమాజాన్ని కోరినారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

## గంధమహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



**గూడూరు, జూలై 12, ప్రభాతవార్త** గూ డూరు పట్టణంలో వెలసియున్న హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా (చిన్న దర్గా) వారి గంధమహోత్సవ కరపత్రా ల ను ఆదివారం దర్గా ముస్లిం వెల్ఫేర్ కమి టీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ చేతు ల మీదుగా కమిటీ సభ్యుల సమక్షంలో దర్గా ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్, ముజావర్ మగ్దూమ్‌లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సఫర్ మాసం చంద్రోదయం రోజున హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా వారి దర్గా నందు నిషాన్ జండా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పద్దెనిమిదవ రోజున గంధం జరుగుతుందని దాదాపు 175 సంవత్సరాల చరిత్ర కలిగిన దర్గా అని భక్తులు ఎంతో భక్తి విశ్వాసాలతో దర్గాకు వస్తుంటారని మత సామరస్యానికి నిలువెత్తు నిదర్శనం దర్గాలు అని అన్నారు. గంధమహోత్సవ కరపత్రాలను కమిటీ సభ్యులతో కలసి ఆవిష్కరించామని ఈ నెల 15వ తేదీ బుధవారం రాత్రి ఏడు గంటలకు నిషాన్ కార్యక్రమం జరుగనుందని ఆగష్టు 2వ తేదీ ఆదివారం గంధమహోత్సవం జరుగనుందని భక్తుల సౌకర్యార్థం దర్గా ఆవరణంలో గంధమహోత్సవం రోజు అన్నదాన కార్యక్రమం నిర్వ హిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, మత గురువులు మగ్దూమ్ అలీషా, షానవాజ్, షబ్బీర్, యస్దాని, గోల్డెన్ గౌస్, మస్తాన్ ఖాదరి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- గిట్టుబాటు ధరలు కల్పించాలి- యానాది ఎరుకల కులాలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలి
- గిరిజన సంక్షేమ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి



**నెల్లూరు సిటీ, జూలై 12, ప్రభాతవార్త** గిరిజనులు (యానాది ఎరుకల కులాలు) సేకరిస్తున్న అటవీ ఫలసాయం సాయాన్ని జిల్లా సమగ్ర గిరిజ న అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ కార్పొరేషన్) ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని, వేజ్ రేట్ నిర్ణయించి గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సంక్షేమ సంఘాల జా యింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పాలకీర్తి రవి కోరారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ గిరిజనుల వద్ద ఉన్న అటవీ ఉత్పత్తులను గిరిజన కార్పొరేష న్లలో కానీ, ప్రభుత్వ గుర్తింపు పొందిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించాలన్నారు. ధరల నిర్ణయం విషయంలో దళారుల ప్రవేశం కానీ, జోక్యంకానీ ఉండకూడదన్నారు. అదేవిధంగా గిరిజనులకు జీవనా ధారమైన వన ఉపాధులను మెరుగు పరచడం, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమ లు చేస్తున్న ఎంఎస్‌పి, ఎంఎఫ్ఎం పథకం కింద మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ (ఎంఎఫ్ పిఎస్) ద్వారా కనీస మద్దతు ధరలు కల్పించే దిశగా ట్రైఫాడ్ అధికారులు ఇప్పటికే చర్య లు తీసుకోవడం సంతోషదాయకమన్నారు. అదే క్రమంలో గ్రామస్థాయిలో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు గిరిజనులు పారదర్శకంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ కింద ఫల సాయం ఉత్పత్తులు సేకరించే గిరిజనులకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా ప్రభుత్వం సవరించిన గిట్టుబాటు ధరల వివరాలను సమీప అటవీశాఖ కార్యాల యంలోనూ, మన సంరక్షణ సమితులలోను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రభుత్వమే సేకరించే విధంగా చర్యలు తీసు కోవాలన్నారు. గిరిజనులు సేకరించి అటవీ ఫల సాయం ఉత్పత్తులకు దేశంలోనే మంచి గిరాకీ ఉందని, గిరి జన ప్రాంతాల్లోని మైదానాల్లో ఫలసాయం ఉత్పత్తులను విక్రయించుకునే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతాల్లో గిరిజనులు సేకరిస్తున్న కరక్కాయలు, ముసిని పిక్కలు, చింతపండు, చింత గింజలు, కొండ చీపుర్లు, దనికాయలు, నల్ల జీడిపిక్కలు తదితర ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని, అలాగే గిరిజన ఉత్పత్తుల అమ్మకాలు కొనుగోలు విషయాల్లో సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం అటవీశాఖ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు.

## మంట కలుస్తున్న మానవాత్వం

**డబ్బుకోసం మృగాలుగా మారుతున్న మనుషులు**
**బుచ్చి వ్యవసాయాధికారి శ్రీహరి మృతి హత్యగా తేలడం సంచలనం**
**చట్టాన్ని కాపాడాల్సిన పోలీస్ అధికారే కేసును రూట్ మార్చాడన్న ఆరోపణలు**



**బుచ్చి జులై 12 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలం వ్యవసా యాధికారి శ్రీహరి మృతి మి స్టరిగా మారింది. శ్రీహరి మొదటిభార్య లావణ్య జిల్లా ఎస్‌పికి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు విచా రణ చేపట్ట డంతో తీగలాగితే డొంకకదిలినట్లు అస లు వాస్తవాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. శ్రీహరి మృతి చెందిన రోజు స్వగ్రామమైన మినగ ల్లులో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో శ్రీ హరి మెడపైన గాయాలు ఉండడంతో దానిని పలు వురు ప్రశ్నించగా కుటుం బసభ్యులు దానిని దాట వేసి,హడావుడిగా దహన సంస్కారాలు చేశా రు. అప్పటి నుండి ఈకేసు విషయంలో అందరికి అనుమానంగానే ఉంది.శ్రీహరి విషయంలో అను మానాలు వ్యక్త పరుస్తున్నా పోలీసులు దీనిపైన సీరియస్‌గా తీసుకోకుండా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్రంగా విమర్శలుచేశారు. ఒ పోలీస్ అధి కారికి పెద్దఎత్తున ముడుపులు ముట్టాయని దాంతో ఏమి పట్టించుకోలేదని తెలుస్తొంది. జిల్లా ఎస్‌పి చొరవతో ఒక్కొక్క విషయం బయటకు వ స్తుంది. జిల్లా ఎస్‌పి చొరవతో పోలీ సులు అనుమా నితుడ్ని విచారించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బావమ రిదే కుక్క ఇంజక్షన్ మూడు సార్లు చేసి వ్యవసాయాధికారి శ్రీహరిని హత్య చేసి గుండెపోటుగా చిత్రీకరించారని తెలు స్తొంది. సొంత బావమరిదే ఈ ఘటనకు పాలు పడితే ఇంక మాన వత్వం ఎక్క డుందని పలు వురు విస్తుపోతున్నారు. బావమరిది బ్రతకకోర తాడని పెద్దలు చెబు తుంటారు.కాని ఇక్కడ బావమరిదే హత మార్చాడు, మృతి చెందిన రో జే పోలీ సులు కే సు నమోదు చేసి పోస్టు మార్టం చేసి వుంటే అ ప్పుడే వాస్తవా లు బయటపడే వని పలువురు విమర్శలు చేసు న్నారు. వివాదర హితుడుగా మండలంలో మంచి పేరు తెచ్చుకున్న శ్రీహరిని ఇలా చేయడం దారుణ మని పలువురు ఖండిస్తున్నారు. మొదటిభార్య చొర వతోనే అసలు విషయాలు బయటకు రాయడం విశేషం.